క్లుప్తంగా

గగ్లాసునీ అమ్మవారికి సాయిరాజ్ పూజలు


సాయిరాజ్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కవిటి: డిగొనపపుట్టుగ గ్రామదేవత గగ్లాసునీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావులు మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు ఇరువురు నేతలకు పూర్ణకుంభాలతో స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రాల్ని బహూకరించి వేదాశీర్వచనాల్ని అందించారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

మహిళకు ‘ఉద్దానం’ ఆర్థిక సాయం


వైదేహికి సాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల వైదేహి భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో వైదేహి ఇద్దరు పిల్లలతో ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు, గ్రామ క్రికెట్ జట్టు కలిసి రూ. 9,200 సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమెకు మంగళవారం అందజేశారు. సొసైటీ ప్రతినిధులు జోగారావు, చంటి, శ్యాం, షణ్ముఖ, కృప, అఖిల్, శేఖర్ ఉన్నారు.

రెండు గడ్డి కుప్పలు దగ్ధం


కాలిపోతున్న గడ్డికుప్పలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఐదో వార్డు తాళ్లభద్ర గ్రామంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో బమ్మిడి శ్రీనివాసరావుకు చెందిన రెండు గడ్డి కుప్పలు బూడిదయ్యాయి. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

వైద్యానికి ప్రాధాన్యత


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. పల్లిసారధిలో మంగళవారం వైఎస్సార్ హెల్త్ ప్రొగ్రాంలో భాగంగా 104, ఫ్యామిలీ ఫిజియోషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల చెంతకే వైద్య సేవలను ప్రభుత్వం తీసుకెళ్తోందన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ త్రినేత్ర, సీహెచ్‌వో కె.యామిని, సిబ్బంది ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కోటబొమ్మాళి: తర్లిపేట, రామయ్యపేట గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కురుడు, నిమ్మాడ, తిలారు పశువైద్యులు లఖినేని కిరణ్ కుమార్, డాక్టర్ వెకటేష్, ఎం.ప్రగ్నశ్రీలు 223 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, వి.భానోజీరావు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి అరుదైన గౌరవం

టెక్కలి: ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ దక్కడం తెలుగు సాహిత్యానికి దక్కిన అరుదైన గౌరవమని టెక్కలికి చెందిన సాహిత్య సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టారు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆస్కార్ అవార్డుతో తెలుగు సాహిత్యానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సీరియస్

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని రోగుల మంచాల వద్దకు కుక్కలు చొరబడుతున్నాయి. దీనిపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన డబ్బీరు భవానీశంకర్ పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందితో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఇంతమంది విధుల్లో ఉంటూ కుక్కలు లోనికి రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

● ఊరూరా డీవార్మింగ్ డే

ఇచ్ఛాపురం రూరల్: నులిపురుగుల నివారణతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేవతి భేరి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండపల్లి అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నులి పురుగుల వలన చిన్నారుల్లో కర్తహీనత, వ్యాధి నిరోధకశక్తి తగ్గుదల, శరీరం బలహీనం కావడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ మాత్రలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కవిరాజురెడ్డి పాల్గొన్నారు.

మందస: ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు ఆధ్వర్యంలో నులుపురుగుల నివారణ మాత్రలను విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు అందజేశారు. బుడంబోకాలనీ, సిరిపురం, మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 143 పాఠశాలలు, 190 అంగన్‌కేంద్రాలు, ఆరు కళాశాలలు, గురుకులం, కేజీబీవీ పరిధిలో చిన్నారులకు మాత్రలు అందించారు. 95 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని ఎంపీడీవో తిరుమలరావు చెప్పారు. పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఇప్పిలి వెంకటరమణ, వైద్యాధికారులు టి.శైలజ, రవికుమార్‌దొర, జనార్దననాగసాయి, ఎంఈఓ ఎం.లక్ష్మణరావు, మందస పంచాయతీ ఈఓ అన్నెపు వెంకటసత్యన్నారాయణ పాల్గొన్నారు.

కవిటి: ప్రాథమిక స్థాయిలో చదువుతున్న బాలబాలికలకు నులిపురుగుల నివారణతోనే చదువులో ఏకాగ్రత సాధ్య పడుతుందని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశాంక్ పర్యవేక్షణలో బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అభిమన్యు సోయి, సిబ్బంది కె.జానకీరావు పాల్గొన్నారు.

పలాస: రంగోయి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ, కాశీబుగ్గ సాయికాలనీలోని ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నులుపురుగుల నివారణ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేసి.. వారితో మిగించారు. కార్యక్రమంలో పలాస ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఎంఈవో శ్రీనివాసరావు, రంగోయి ప్రధానోపాధ్యాయుడు టి.హేమారావు, ఎస్.రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల కడుపులో ఉండే నులిపురుగులు నశించి శారీరకంగా ఎదుగుతారని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డీవార్మింగ్ డే నిర్వహించారు. వైద్య సిబ్బంది సమక్షంలో విద్యార్థులతో భోజనం అనంతరం మాత్రలను మింగించారు. పట్టణంలోని బెల్లుపడకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాత్రలను అందించారు.

కోటబొమ్మాళి: డీవార్మింగ్ డే సందర్భంగా స్థానిక బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ పంపిణీ చేశారు. ఆరోగ్యంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిమ్మాడ పీహెచ్‌సీ డాక్టర్ నితీష్, హెచ్‌ఎం పోలినాయుడు పాల్గొన్నారు.

టెక్కలి: పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వైద్య సబ్బంది పంపిణీ చేశారు. కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నులిపురుగుల నివారణ మాత్రలను తప్పని సరిగా చిన్నారులకు అందించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. సీతాపురం, బెండి, పెద్దబొడ్డపాడు, నగరంపల్లి, నువ్వలరేవు తదితర గ్రామాల్లో ఆమె పర్యటించి డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు మాత్రలను అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.


ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది


మందస: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న అధికారులు


కవిటి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న అధికారులు


పలాస: రంగోయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అధికారులు


ఇచ్ఛాపురం: విద్యార్థితో మాత్రలను మింగిస్తున్న ఎంఈవో అప్పారావు


కోటబొమ్మాళి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: సీతాపురం పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఈశ్వరమ్మ

బొరివంక సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లైను


రాజపురం సబ్‌స్టేషన్ లైన్‌ను పరిశీలిస్తున్న సాయిరాజ్, విద్యుత్ శాఖ అధికారులు

● నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ వెల్లడి

కవిటి: బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా 33 కేవీ లైన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తూ అనుమతులు మంజూరైనట్టు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ వెల్లడించారు. విద్యుత్‌శాఖ కనస్ట్రక్షన్ డీఈఈ పీవీవీసత్యన్నారాయణతో కలిసి రాజపురం, బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ల లైన్లను ఆయన మంగళవారం పరిశీలించారు. బొరివంక సబ్‌స్టేషన్‌కు కేవలం ఒక్క 33 కేవీలైన్ ఉండడంతో సుదూరంలో ఉన్న దీనికారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల్ని ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేలా విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ సీఎండీని, డైరెక్టర్లను వారి కార్యాలయంలో కలిసి అదనపు లైన్ ఏర్పాటుకు వినతిపత్రం అందించి దాన్ని సాధించినట్టు సాయిరాజ్ వివరించారు. దశాబ్దాల కాలంగా ఎదురుచూసిన ఈ సమస్యను సాయిరాజ్ చాకచక్యంగా పరిష్కరించడంపై ఆయా ప్రాంతాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే రాజపురం నుంచి బొరివంకకు మంజూరైన ప్రత్యామ్నాయ లైన్ పనులు ప్రారంభిస్తున్నట్టు డీఈఈ పీవీవీ సత్యన్నారాయణ తెలిపారు. పరిశీలనలో పార్టీ నాయకులు పి.లక్ష్మణరావు, బి.శ్రీరాంప్రసాద్, పి.శేఖర్, నీలాచలం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు

కంచిలి: స్థానిక సంస్థలు, ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం రాత్రింబవళ్లు చిత్తశుద్ధితో శ్రమించిన వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు తన కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ప్రతి ఎన్నికలో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

అమ్మవారికి పూజలు


సోంపేట: అమ్మవారికిపూజలు చేస్తున్న పిరియా విజయ

సోంపేట: సోంపేటలోని నింబాషిణి అమ్మవారిని జెడ్పీ చైర్మన్ పిరియా విజయ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఐదో వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను కమిటీ సభ్యులు సత్కరించారు. ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోదమ్మ, ఎంపీటీసీ సభ్యులు నిమ్మన లీలారాణి, పొడుగు కామేష్ పాల్గొన్నారు.

గంగాదేవికి..

కంచిలి: పురుషోత్తపురం గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగాదేవి గావు అమ్మవారి సంబరాల్లో జె చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, కొల్లి ఈశ్వరరావు, కొణపల సురేష్, డొక్కరి బలరాం పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం


తోగాలమ్మ సంబరంలో ఏకరూప చీరలతో మహిళలు


కవిటి: చింతామణి అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్ : లొద్దపుట్టి గ్రామంలో తోగాలమ్మ అమ్మవారి సంబరం భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని మేళతాళాలతో గ్రామ పొలిమేర వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు ఎరుపు రంగు ఏకరూప చీరలను ధరించి ఘటాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

నేత్రపర్వంగా..

కవిటి : ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు చల్లదనం ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలు.. బాజాభజంత్రీలతో పట్టణవీధుల్లో ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ.. యువకులు నృత్యం చేస్తూ సందడి చేశారు.

40 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంచిలి: పి.శాసనాం గ్రామంలో హెల్ప్ ఏజ్ సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. నేత్ర వైద్యసహాయకుడు ఆర్.శివ 40 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. పది మందికి మందులు అందజేశారు. ఏడుగురిని కళ్లద్దాల కోసం గుర్తించారు. మరో ఎనిమిది మందికి ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. స్థానిక సర్పంచ్ జి.వేణు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మందస: ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ చింతాడ శరత్ బాబు అన్నారు. సిబ్బందితో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు జంబ్లింగ్ విధానంలో జరుగుతాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, మందస జూనియర్ కళాశాల, శాతవాహన, ఆదిత్య కళాశాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు అరగంట ముందుగా హాజరు కావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేదిలేదన్నారు. డీఓ టి.మురళీకృష్ణ, ఎల్.సోమేశ్వరరావు, నాగభూషణం, ప్రభాకర్‌పట్నాయిక్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఔదార్యం


పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి 19వవార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి ఔదార్యాన్ని చాటుకున్నారు. సూదికొండ ప్రాంతంలో సొంత నిధులతో కాలువలకు పైపులైన్ ఏర్పాటు చేశారు. అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో మురుగునీరు ప్రవహించడం లేదు. ఈ సమస్యను తక్షణ పరిష్కరించాలనే ఉద్దేశంతో సొంత నిధులతో పైపులను కొనుగోలు చేశారు. జేసీబీతో పైపులను ఏర్పాటు చేసే పనులను మంగళవారం చేపట్టారు. వార్డు ప్రజలు కౌన్సిలర్‌ను అభినందించారు. వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపి పాల్గొన్నారు.

అగ్ని గంగమ్మకు నాలుగున్నర కిలోల వెండి వితరణ


అమ్మవారికి అలంకరించిన మకరతోరణం

మందస: పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ప్రాంతంలోని నీలావడి (ఒడిశా)లో కొలువైన అగ్ని గంగమ్మతల్లి అమ్మవారి ఆలయానికి మందసకు చెందిన మోణంగి తాతారావు కుటుంబ సభ్యులు నాలుగున్నర కిలోల వెండి ఆభరణాలను వితరణ చేశారు. అమ్మవారికి మూడున్నర కిలోల మకర తోరణం, కిలో వెండి కుందెలను ఆలయ కమిటీకి అందజేశారు.

కేటీరోడ్డు పనులు పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటీ రోడ్డులో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్నటువంటి ఫుట్‌పాత్, రోడ్డు మధ్యలో ఉన్నటువంటి ఖాళీస్థలాన్ని రోడ్డుగా మారుస్తున్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ దున్న సత్యం, మున్సిపల్ ఏఈ అవినాష్ ఉన్నారు.

గణితంపై భయాన్ని వీడాలి


‘పై’ ఆకృతిలో విద్యార్థులు

మందస: గణతంపై భయాన్ని విద్యార్థులు వీడాలని పొత్తంగి–సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చదువుల విశ్వనాథం, గణిత ఉపాధ్యాయులు సింహచలపతి, గవ్వ భీమారావు, కె.రుద్రయ్య అన్నారు. స్థానిక పాఠశాలలో ‘పై’ దినోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్షల్లో విద్యార్థులు ఎక్కువగా లెక్కల సబ్జెక్టంటే భయపడుతుంటారన్నారు. చక్కగా అర్థం చేసుకుంటే ఈ సబ్జెక్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గణితంలో విరివిగా ఉపయోగించే ఈ విలువ 22/2 లేదా 3.14కి సమానమన్నారు. దీని విలువ 3.14గా పరిగణిస్తూ ప్రతీ ఏటా మార్చి 14న పైదినోత్సవం జరుపుకుంటారన్నారు. విద్యార్థులు ‘పై’ ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమనాథ్, కరుణాకర్, సుశాంత్‌కుమార్, ఢిల్లీ, నారాయణ పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్‌పై అవగాహన


చేతులు శుభ్రంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: విద్యార్థులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మకరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సోమేశ్వరరావు అన్నారు. విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పిల్లలతో మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది వి.మీనాకుమారి, వి.మహాలక్ష్మి, ఎం.మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చిన్నారుల తూనిక కొలతలు గమనిస్తున్న లావణ్య

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే మనందరి లక్ష్యం కావాలని ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ఏసీడీపీవో వై.లావణ్య అన్నారు. తిప్పనపుట్టుగ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రాల్లోని పిల్లలందరూ సాధారణ, తక్కువ బరువు, తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లతై స్థితిని పొందేందుకు ఎదుగుదల కొలతలు ఎంతో అవసరమన్నారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ పోషకాహారాన్ని అందజేశారు. సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి ఫ్యాన్ల వితరణ


ఫ్యాన్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస బీసీ పోస్టుమెట్రిక్ బాలిక వసతి గృహానికి కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సభ్యులు ఫ్యాన్లను మంగళవారం వితరణ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని రూ.14,500 విలువైన ఫ్యాన్లను మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ద్వారా వార్డెన్ దాసరి క్రిష్ణవేణికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు నెమలిపురి అప్పారావు, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, పూర్వ అధ్యక్షులు కొర్రాయి బాలక్రిష్ణ యాదవ్, యెండుదొర, హేమాచలం, కొండలరావు, వెంకటరావు పాల్గొన్నారు.